www.prajasakti.com

ప్రజాశక్తి

ఆదివారం 9 ఫిబ్రవరి 2025



ప్రముఖ కవి రత్నాజీకి కవితా పురస్కారం

ప్రజాశక్తి–చాగల్లు

చాగల్లుకు చెందిన ప్రముఖ కవి నేలాపూరి రత్నాజీని గుంటూరులోని రావి రంగారావు సాహిత్య పీఠం జనరంజక కవితా పురస్కారం అందుకున్నారు. జాగా లేని గాజా దీర్ఘకావ్యానికి ఈ అవార్డు వచ్చినట్టు తెలిపారు. ఈ సభలో ట్రస్ట్ అధ్యక్షుడు రావి రంగారావు, నన్నయ యూనివర్సిటీ తెలుగు అసోసియేట్ ప్రొఫెసర్ తరపట్ల సత్యనారాయణ, జిల్లా గ్రంథాలయ చైర్మన్ సాహిత్య పీఠం డైరెక్టర్ నర్రా ప్రభావతి పాల్గొన్నారు.



కవి రత్నాజీని సత్కరిస్తున్న సభ్యులు

'బెల్ట్'పై కొరవడిన నిఘా..!

- గ్రామాల్లో ఏరులై పారుతున్న మద్యం
- దుకాణాల్లో అదనపు ధరలు
- కన్నెత్తి చూడని అధికారులు

ప్రజాశక్తి – కాకినాడ ప్రతినిధి

కూటమి ప్రభుత్వ పాలనలో మద్యం ఏరులై పారుతుంది. రోడ్లపైనే గ్లాసులు గలగలలాడుతున్నాయి. వందల సంఖ్యలో వెలసిన బెల్ట్ షాపుల్లో మద్యం అమ్మకాలు యథేచ్ఛగా జరుగుతున్నాయి. కూటమి సర్కారు అధికారంలోకి వచ్చిన తర్వాత మద్యం అమ్మకాలను విపరీతంగా పెంచారు. దాదాపుగా అన్ని రకరకాల బ్రాండ్లు అందుబాటులోకి వచ్చాయి.

కాకినాడ జిల్లాలో 155 ప్రయివేటు మద్యం దుకాణాలు, 20 బార్లు, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 169 షాపులు, 10 బార్లు, తూర్పు గోదావరి జిల్లాలో 154 దుకాణాలు, 19 బార్లు ఉన్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రోజుకి రూ.13 నుంచి 15 కోట్లు వరకూ మద్యం విక్రయాలు జరుగుతున్నాయి. ప్రత్యేక సందర్భాలు, పండుగల రోజుల్లో రోజూవారీ అమ్మకాలు రూ. 25 నుంచి రూ.30 కోట్ల దాటుతోంది. తమ ప్రభుత్వంలో ప్రయివేటు వ్యక్తుల చేతుల్లోకి అమ్మకాలు ఇచ్చినప్పటికీ బెల్ట్ షాపులపై కొరడా గులిపిస్తామంటూ చంద్రబాబు ప్రకటనలు గుప్పించారు.

భారీగా బెల్ట్ లు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో బెల్ట్ షాపులు విచ్చలవిడిగా పెరిగిపోయాయి. ఒక్కో గ్రామంలో పదుల సంఖ్యలో బెల్ట్ దుకాణాలు నడుస్తున్నాయి. పట్టణ ప్రాంతాల్లో అయితే ప్రతీ 10 బడ్డీ దుకాణాల్లో 8 షాపుల్లో మద్యం విక్రయాలు జరుగుతున్నాయి. క్వార్టర్ బాటిల్ పై రూ.10 నుంచి రూ.30 అదనంగా వసూలు చేస్తున్నారు. ప్రయివేటు మద్యం దుకాణాలతో పాటు అనధికారికంగా బెల్టు షాపుల ద్వారా కాకినాడ జిల్లాలో అమ్మకాలను పరిశీలిస్తే గత ఏడాది డిసెంబర్ 31 రోజున రూ.12.50 కోట్లు మద్యం అమ్మకాలు జరగగా ఈనెలలో సంక్రాంతి మూడు రోజులపాటు దాదాపు రూ.30 కోట్లు పైనే మద్యం వ్యాపారం జరిగింది. మొత్తంగా ఈ జనవరిలో రూ.100 కోట్లు పైనే ఇక్కడ మద్యం అమ్మకాలు జరిగాయి. గతంలో బెల్ట్ షాపులు లేని సమయంలో ఈ వ్యాపారం సుమారు రూ.70 కోట్లు మాత్రమే ఉండగా ఈ సారి భారీగా బెల్ట్ షాపులు పెరగడంతో సుమారు రూ. 30 కోట్లు అదనంగా వ్యాపారం జరిగిందని అంచనా. దుకాణాల్లో ఉదయం 10 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు విక్రయాలు జరుగుతుండగా బెల్ట్ షాపుల్లో మాత్రం 24 గంటలూ మద్యం అందుబాటులో ఉంటుంది. ఏపీ బ్రాండ్లే కాకుండా పొరుగు రాష్ట్రాలకు చెందిన కొన్ని బ్రాండ్లు సైతం ఇక్కడ విక్రయిస్తుండడం గమనార్హం. త్రాగునీరు అందుబాటులో లేని మారుమూల ప్రాంతాల్లో సైతం మద్యం ఏరులై పారుతుంది. గుడి, బడి అనే తేడా లేకుండా సమీప ప్రాంతాల్లో సైతం మద్యం విక్రయాలు జరుగుతున్నాయి.



కాకినాడ సిటీ పరిధిలోని మద్యం అమ్ముతున్న ఒక బెల్ట్ షాపు

నివాస గృహాల మధ్యనే...

బెల్ట్ షాపుల ద్వారా ఇళ్ల మధ్యే బహిరంగంగానే పగలు, రాత్రి అనే తేడా లేకుండా అమ్మకాలు జరుగుతున్నా సంబంధిత అధికారులు కనీసంగా అటువైపు చూడకపోవడం శోచనీయమని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నివాస ప్రాంతాలకు అతి చేరువలో బెల్ట్ షాపుల్లో మందుబాబులు విచ్చలవిడిగా మద్యం సేవిస్తుండగా అటువైపు వెళ్లే మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొన్నిచోట్ల మందు బాబుల మధ్య వివాదాలు జరుగుతుండగా ఘర్షణ వాతావరణం నెలకొనడంతో స్థానికులు భయభ్రాంతులకు గురవుతున్నారు. కూటమి ప్రభుత్వం విచ్చలవిడిగా మద్యాన్ని ఏరులై పారిస్తుండడంతో ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అన్ని ప్రాంతాల్లో బెల్టుషాపులు బహిరంగంగానే అమ్మకాలు జరుపుతున్నా సంబంధిత ఎక్సైజ్ శాఖ అధికారులు పట్టనట్లే వ్యవహరిస్తుండడంపై అనేక ఆరోపణలు వెల్లువెత్తు తున్నాయి. మామూళ్ల మత్తులో జోగుతూ కావాలనే పట్టించుకోకుండా వ్యవహరిస్తున్నారని వారిపై విమర్శలు వినిపిస్తున్నాయి. మరోవైపు కొన్ని చోట్ల మద్యం దుకాణాల యజమానులు నాసిరకం మద్యం అమ్ముతూ సామాన్యుల ఆరోగ్యాలతో చెలగాటమాడుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొందరు సిండికేట్ గా మారి ధరలను విపరీతంగా పెంచి పేదల జేబులను కొల్లగొడుతున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. క్వార్టర్‌పై రూ.10 నుంచి 30 కి అదనంగా అమ్మకాలు జరుపుతున్నారు. ప్రభుత్వమే ఆదాయమే పరమావధిగా భావిస్తూ ఎక్కడికక్కడ బెల్ట్ షాపులను ప్రోత్సహిస్తుందన్న ఆరోపణలు ఉన్నాయి. ఒకప్పుడు బెల్టు దుకాణాలు కనిపిస్తే కఠిన చర్యలు తీసుకున్న అధికారులు ఇప్పుడు గ్రామ గ్రామానా.. ఊరు వాడ అనే తేడా లేకుండా వీధి వీధినా బెల్ట్ షాపులు దర్శనమిస్తున్నా కన్నెత్తి చూడని పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలోనే ప్రజల నుంచి పెద్ద ఎత్తున పిర్యాదులు అందుతున్నా పట్టించుకోని పరిస్థితి ఏర్పడింది.



పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థి డివి.రాఘవులుకు మద్దతుగా అభివాదం చేస్తున్న ఎంఎల్‌సి ఐవి, ప్రజాసంఘాల నాయకులు

చట్టసభల్లో ప్రజా గొంతుక పిడిఎఫ్ అభ్యర్థులు

ప్రజాశక్తి – రాజమహేంద్రవరం ప్రతినిధి

అధికారపక్షం, ప్రతిపక్షంలో చేరకుండా సమస్యల పరిష్కారంలో ప్రజా పక్షాన నిలబడి గొంతెత్తి నినదించేది పిడిఎఫ్ ఎంఎల్‌సిలు మాత్రమేనని ఉభయ గోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వర అన్నారు. శనివారం రాజమండ్రి ఆనం రోటరీ హాల్లో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఉభయ గోదావరి జిల్లాల పిడిఎఫ్ పట్టభద్రుల అభ్యర్థి డివి.రాఘవులు పరిచయ కార్యక్రమం నిర్వహించారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు పి.జయకర్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎన్.అరుణ కుమారి ఆధ్వర్యాన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌సి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వాలు కార్పొరేట్ శక్తులకు వంత పాడటంతో నిరుద్యోగులు, పేదలు, నిమ్న వర్గాలకు ఉపాధి అవకాశాలు లేక అనేక ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. నిజాయితీ, నిస్వార్థం క్రమశిక్షణ ప్రజా సమస్యల పట్ల పోరాటం పిడిఎఫ్ ఎంఎల్‌సిల ఆస్తులు అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉమామహేశ్వరరావు మాట్లాడారు. డిఎస్‌సి నియామకాల కోసం ఎన్నికల్లో మాట ఇచ్చి గెలిచిన తర్వాత ప్రభుత్వం ఏర్పడి తొలి సంతకం చేసి కూడా ఎనిమిది నెలలు కావస్తున్నా ఇప్పటివరకు డిఎస్‌సి అతీగతీ లేదన్నారు. కుంటిచాకులు చెబుతూ డిఎస్‌సిని ప్రభుత్వం వాయిదా వేస్తోందన్నారు. విజన్ 2047 అంటూ ప్రభుత్వం కార్పొరేట్లకు లబ్ధి చేకూరేలా వ్యవహారాలు చేస్తోందన్నారు. కాంట్రాక్ట్ లెక్చరర్, అంగన్‌వాడీల సమస్యల పట్ల కూడా ప్రభుత్వం సక్రంగా స్పందించట్లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగ ఉపాధ్యాయుల సిపిఎస్ రద్దు, ఒపిఎస్ అమలు, నూతన పిఆర్‌సి కమిటీ ఏర్పాటు వంటి సమస్యల మీద కూడా ప్రభుత్వం ఇంకా ఉదాసీన వైఖరి అవలంబిస్తోందన్నారు. పిడిఎఫ్ అభ్యర్థి డివి రాఘవులుకు ఓటేసి గెలిపిస్తే, ప్రజా సమస్యల పట్ల శాసన మండలిలో నినదించే గొంతువుతారని పేర్కొన్నారు. సిఐటియు జిల్లా కార్యదర్శి అరుణ్ మాట్లాడుతూ శాసనమండలిలో గత పిడిఎఫ్ ఎంఎల్‌సి పనితీరు ప్రతి గ్రాడ్యుయేట్ ఓటర్ దృష్టికి తీసుకెళ్లాలని ఆయన కోరారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎన్.అరుణ కుమారి మాట్లాడుతూ ప్రతి కార్యకర్త పిడిఎఫ్ అభ్యర్థేనని విజయం సాధించే వరకు అందరూ ఐక్యతతో కృషి చేయాలని పేర్కొన్నారు. మరో రాష్ట్ర కార్యదర్శి జ్యోతిబసు మాట్లాడుతూ 2007 నుంచి ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గానికి మూడుసార్లు ఎన్నిక జరగగా రెండుసార్లు పిడిఎఫ్ అభ్యర్థులే విజయం సాధించారన్నారు. ప్రస్తుతం సిట్టింగ్ ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు పిడిఎఫ్ అభ్యర్థేనన్నారు. ఈ సిట్టింగ్ స్థానాన్ని మళ్లీ మనమే నిలబెట్టుకోవాలని పిలుపునిచ్చారు. గ్రాడ్యుయేట్ పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థి డివి రాఘవులు మాట్లాడుతూ తాను మండల స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకూ యుటిఎఫ్, ఇతర ఉద్యోగ సంఘాల్లోని కీలక బాధ్యతలు నిర్వహించి అనేక పోరాటాల్లో, పలు ప్రజా ఉద్యమాల్లో పాల్గొన్నట్టు తెలిపారు. తనను గెలిపిస్తే మండలంలో ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు నినదించే గొంతునవుతానని పేర్కొన్నారు. కాంట్రాక్ట్ లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి మాణిక్యం మాట్లాడుతూ ప్రభుత్వాలు కాంట్రాక్టు ఉద్యోగుల శ్రమ దోపిడీ చేస్తున్నాయని, కాంట్రాక్టు ఉద్యోగుల రేషన్‌లైజేషన్ ఎప్పటికప్పుడు ప్రభుత్వాలు దాట వేస్తున్నాయని కాంట్రాక్టు ఉద్యోగులకు న్యాయం జరగాలంటే, వాళ్ల వైపు పోరాటాలు చేస్తూ చట్టసభల్లో ప్రశ్నించాలంటే పిడిఎఫ్ అభ్యర్థిని కచ్చితంగా గెలిపించుకోవాలన్నారు. పిడిఎఫ్ అభ్యర్థిని గెలిపించేందుకు గ్రాడ్యుయేట్ ఓటర్లు సిద్ధంగా ఉన్నారని మనం వాళ్ళని కలిసి అభ్యర్థించటమే తరువాయి అన్నారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా నాయకులు జువ్వల రాంబాబు, జెఎసి జిల్లా నాయకులు ప్రవీణ్, అంగన్‌వాడీ రాష్ట్ర నాయకురాలు బేబిరాణి, యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జయకర్, ఎ.షరీఫ్, ఉపాధ్యక్షులు ఎం.విజయ గౌరి, కోశాధికారి ఇవిఎస్ఆర్.ప్రసాద్, జిల్లా కార్యదర్శి కె.రమేష్, ఎం.శ్రీనివాస్, ఇ.శ్రీమణి, చిలుకూరి శ్రీనివాసరావు ప్రకాష్, పి.శ్రీనివాసమూర్తి, ఎం.దయానిధి, వివి.రమణ, వెంకటరమణ, నర్సారెడ్డి, యుటిఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రూపస్ రావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కల్యాణోత్సవం

ప్రజాశక్తి–గోకవరం

గోకవరంలో శ్రీవెంకటేశ్వర స్వామి 33వ కల్యాణ మహోత్సవాలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జగ్గంపేట ఎంఎల్ఎ, టిటిడి బోర్డు మెంబర్ జ్యోతుల నెహ్రూ స్వామివారిని దర్శించుకున్నారు. ఆయనతోపాటు టిడిపి జగ్గంపేట నియోజకవర్గ ఎంఎల్‌సి ఎన్నికల పరిశీలకుడు పెందుర్తి గండి బాబ్జి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు వారికి ఘనంగా స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రాఘవులును గెలిపించాలి

ప్రజాశక్తి – రాజమహేంద్రవరం

ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం నుంచి పిడిఎఫ్ ఎంఎల్‌సిగా పోటీ చేస్తున్న దళిత సామాజిక వర్గానికి చెందిన దిడ్ల వీర రాఘవులుకు మొదటి ప్రాధాన్యత ఓటుతో గెలిపించాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం(కెవిపిఎస్) జిల్లా ప్రధాన కార్యదర్శి జువ్వల రాంబాబు శనివారం ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు నేడు పాలకుల వైఖరి వల్ల ప్రజల జీవితాలు కష్టాలు పాలవుతున్నాయని, ఉపాధి దొరకటమే కష్టంగా మారిందన్నారు. చదువుకున్న యువత సైతం చాలీచాలని జీతాలతో పనిచేస్తున్నారని, జీవితానికి భద్రత లేకుండా పోయిందన్నారు. దళిత సామాజిక వర్గానికి చెందిన బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయడం లేదని, ఎస్‌సి, ఎస్‌టిలకు బ్యాంకు రుణాలు ఇవ్వడం లేదన్నారు. పాలకవర్గాలు కార్పొరేట్ అనుకూల విధానాలను ప్రశ్నించే గొంతుక దిడ్ల వీర రాఘవులు అని, ఆయన్ని గెలిపించుకుందామని కెవిపిఎస్ విజ్ఞప్తి చేస్తుందన్నారు.

పలువురు అధికారులకు షోకాజ్ నోటీసులు

ప్రజాశక్తి –రాజమహేంద్రవరం రూరల్

క్షేత్ర స్థాయిలో రీ సర్వే ప్రక్రియను నిర్దిష్టమైన మార్గదర్శకాలను అనుసరించి నిర్ణీత సమయంలో పూర్తి చెయ్యాల్సి ఉంటుందని, అందులో భాగంగా నిర్లక్ష్యం వహించిన అధికారులకు సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీ చేసినట్టు కలెక్టర్ పి.ప్రశాంతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇద్దరు గ్రామ సర్వేయర్లకి షోకాజ్ నోటీసు జారీ చేసినట్టు తెలిపారు.

నిబంధనలు అనుసరించి సచివాలయం సర్వీసెస్ స్టేటస్ రిపోర్ట్‌ను ధృవీకరించిన తర్వాత, నిర్దిష్ట గ్రామ సర్వేయర్లు తమ విధులను సమర్థవంతంగా నిర్వర్తించడం లేదని జిల్లా యంత్రాంగం దృష్టికి వచ్చిందని తెలిపారు. అధికారిక విధులను నిర్వర్తించడంలో నిర్లక్ష్యం వల్ల జిల్లా పరిపాలనకు ఇబ్బందికరమైన పరిస్థితికి దారితీసిందన్నారు. వీటిపై వివరణ ఇవ్వాలని రాజానగరం మండలం యర్రంపాలెం గ్రామ సర్వేయర్ వి.రమేష్ కుమార్ లాగిన్‌లో ఐదు పౌర సేవలు, కానవరం గ్రామ సర్వేయర్ వై.గంగరాజు లాగిన్‌లో నాలుగు పెండింగ్‌లో ఉండడం వల్ల జిల్లా మొత్తం పురోగతిపై ప్రభావం చూపిందన్నారు. ఈ నేపథ్యంలో వారికి షోకాజ్ నోటీసులు ఇచ్చినట్టు తెలిపారు.

పెరవలి, గోపాలపురం రాజమహేంద్రవరం రూరల్, చాగల్లు, గోకవరం, కడియం, దేవరపల్లి, నల్లజర్ల, బిక్కవోలు, కోరుకొండ, సీతానగరం, రాజానగరంలో 12 మంది మండల సర్వేయర్లు, డిప్యూటీ తహశీల్దార్లు రీసర్వే సమస్యల పరిష్కారానికి సంబంధించి ఆదేశాలను పాటించక పోవడం, విధులకు సమర్థవంతంగా నిర్వహించక పోవడంతో షోకాజ్ నోటీసు జారీ చేసినట్లు తెలిపారు.

కుళ్లిన కోళ్లతో కాలువ నీరు కలుషితం

ప్రజాశక్తి–నల్లజర్ల

అచ్చన్నపాలెంలో పోలవరం కుడి కాలువలో పక్కన ఉన్న పొలాల్లో నీరు వెళ్లేందుకు కాలువ కింద నిర్మించిన అండర్ టెన్నల్‌లో స్థానిక ఈశ్వర పౌల్ట్రీ ఫామ్‌లో వైరస్ వల్ల చనిపోయిన కోళ్ళని ట్రాక్టర్లపై తీసుకొచ్చి పడవేయడం వల్ల టన్నెల్ మొత్తం కుళ్ళిపోయిన కోళ్ల వ్యర్థాలతో నిండిపోయింది. దీంతో చుట్టుపక్కల రైతులకు దారిన పోయే ప్రజానీకానికి దుర్గంధం వెదజల్లడమే కాకుండా టెన్నల్ నుండి క్రిందకు వెళ్లే ఆ కలుషితమైన నీటిని పశువులు తాగి రోగాల బారిన పడుతున్నాయని, అదే నీటిని పంటలకు వరి చేలకు పెట్టాలంటే ఆ దుర్గంధానికి కూలీలు సైతం పనుల్లోకి రావడం లేదని స్థానికులు వాపోయారు. రాత్రి సమయంలో ఆ దుర్గంధం గ్రామం మీదకు రావడం వల్ల గ్రామస్తులు భోజనాలు సైతం తినలేని పరిస్థితి ఏర్పడుతోందని గ్రామస్తులు తెలిపారు. తక్షణమే ఆరోగ్య శాఖ అధికారులు పరిస్థితిని పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. కాలువ గట్టుపై గుంతలు తవ్వి చనిపోయిన కుళ్ళిపోయిన కోళ్లను పాతి పెడుతున్నారని, ప్రభుత్వ భూమిలో ప్రైవేట్ ఫామ్‌కు సంబంధించిన వ్యర్థాలను పాతి పెట్టడం ఎంతవరకు సమంజసమని రైతులు పాతూరి ఆదినారాయణ, కూచిపూడి సత్యనారాయణ, ప్రత్తిపాటి గంగారావు, పాతూరి చిట్టబ్బాయి, కాకర్ల రాంబాబు, పాతూరి రమేష్, కసుకుర్తి కృష్ణారావు ప్రశ్నిస్తున్నారు.



టన్నెల్ వద్ద వ్యర్థాలను పరిశీలిస్తున్న గ్రామస్తులు

గ్రామీణ విద్యార్థులకు ఐఐటి కోర్సులు

ప్రజాశక్తి–తాళ్లపూడి

గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులకు బాల్య దశ నుండే ఐఐటి వంటి కోర్సులతో సమానంగా ఉత్తమ లక్ష్యాలతో విద్యాబోధన అందించాలనే ఆలోచనతో వైష్ణవి ఎడ్యుకేషనల్ యాజమాన్యం తీసుకున్న నిర్ణయం అభినందనీయమని కొవ్వూరు ఆర్‌డిఒ రాణి సుస్మిత అన్నారు. మండల కేంద్రమైన తాళ్లపూడిలో వైష్ణవి ఎడ్యుకేషనల్ అక్షర సిద్ధి పేరుతో నూతనంగా ఏర్పాటు చేసిన పాఠశాలను భవనాలను ఆర్‌డిఒ ప్రారంభించారు. ఎపి స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ డిప్యూటీ సెక్రటరీ సీనియర్ సివిల్ జడ్జ్ సిహెచ్.అమర్ మాట్లాడుతూ దేశ ప్రగతిలో కీలక పాత్ర పోషించే ఉత్తమ విద్యార్థులను అందించే బాధ్యత విద్యాసంస్థల దేనని అన్నారు. ఆకాశ్ విద్యాసంస్థల సౌత్ జోన్ డైరెక్టర్ కెవి రవికాంత్ మాట్లాడుతూ గురువుల ప్రాధాన్యతను వివరించారు. పాఠశాల యాజమాన్యం సనపల సత్యనారాయణ మాట్లాడుతూ తాను పుట్టి పెరిగిన గ్రామ పరిసర ప్రాంతాల్లోని విద్యార్థులకు ప్రాథమిక స్థాయి నుంచి డిజిటల్ విద్యా బోధన అందించాలనే ఆలోచనతో తన భార్య సత్య కళ కరెస్పాండెంట్‌గా గ్రామీణ ప్రాంతంలో విద్యా సంస్థను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ప్రముఖ పారిశ్రామికవేత్త సింహాద్రి జనార్ధనరావు జ్యోతి ప్రజ్వలన చేయగా గణపతి, సరస్వతి, దక్షిణామూర్తి విగ్రహాలను ఆవిష్కరించిన అనంతరం విద్యాసంస్థలను ప్రారంభించారు. ఈ ప్రారంభోత్స వంలో సత్యనారాయణ గురువులు స్నేహితులు విశ్రాంత లెక్చరర్ ప్రభాకర్, విశ్రాంత హెచ్ఎం శర్మ, ఉపాధ్యాయులు అర్జున్‌రావు, ఎస్.సత్యనారాయణ, కె.దత్తుడు తదితరులు పాల్గొన్నారు. జయ ధ్వని ఎడిటర్ పరస రాధాకృష్ణ వ్యాఖ్యాతగా వ్యవహరించారు.



పాఠశాల భవనాన్ని ప్రారంభిస్తున్న ఆర్‌డిఒ రాణి సుస్మిత



వినతిపత్రం అందిస్తున్న నాయకులు

ప్రభుత్వాసుపత్రిని ప్రక్షాళన చేయాలి

ప్రజాశక్తి – రాజమహేంద్రవరం

అవినీతి, నిర్లక్ష్యంతో ఉన్న రాజమ హేంద్రవరం జిల్లా ప్రభుత్వాసుపత్రిని పూర్తిస్థాయిలో ప్రకాళన చేయాలని టిడిపి నగర కార్యనిర్వాహక కార్యదర్శి, 50వ డివిజన్ ఇన్‌ఛార్జ్ మరుకుర్తి రవి యాదవ్ డిమాండ్ చేశారు. శనివారం జిజిహెచ్ ప్రత్యేకాధికారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎస్.భాస్కర్‌రెడ్డికి టీడీపీ నాయకులు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజమహేంద్రవరం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులకు వైద్య సేవలందిస్తోందని అన్నారు. అయితే ప్రస్తుతం రోగులకు సరియైన వైద్యులు అందడం లేదన్నారు. 2 రోజుల క్రితం రాజమహేంద్రవరం జిజిహెచ్‌లో సకాలంలో వైద్యం అందక సీతానగరం మండలం శ్రీరామనగరానికి చెందిన గుండుబోగుల సత్తిబాబు (42) అనే యువకుడు మృతి చెందాడని, అతని మృతికి వైద్యుల నిర్లక్ష్యమే కారణమేనని ఆరోపించారు. ఈ విషయంలో సమగ్ర విచారణ చేసి సంబంధిత బాధ్యుతలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పోస్టు మార్టం నిర్వహించే వైద్యుడి సహాయకుడు అవుట్ సోర్సింగ్‌లో పని చేస్తున్న ప్రసాద్ అనే వ్యక్తి వ్యాపారాన్ని సాగిస్తున్నారని,

రైతులు అగ్రి స్టాక్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి

ప్రజాశక్తి – ఉండ్రాజవరం

మండలంలోని రైతులందరూ అగ్రి స్టాక్ రిజిస్ట్రేషన్ చేయించుకుని, ఎన్‌రోల్‌మెంట్ ఐడి పొందాలని మండల వ్యవసాయ అధికారి ఎం.విశ్వాసరావు శనివారం రైతులకు సూచించారు. అన్నదాత సుఖీభవ, పిఎం కిసాన్ వంటి పలు పథకాలు పొందేందుకు, ఇతర ప్రభుత్వ సేవలు అందుకునేందుకు ఈ రిజిస్ట్రేషన్ ప్రక్రియ తప్పనిసరన్నారు. వ్యవసాయ రంగాన్ని డిజిటలైజేషన్ చేయడంలో భాగంగా ఈ రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభించినట్టు ఆయన తెలిపారు. రైతు సేవా కేంద్రాలలో విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్స్, విలేజ్ హార్టికల్చర్ అసిస్టెంట్స్, ఈ రిజిస్ట్రేషన్ చేస్తారని, ఈ రిజిస్ట్రేషన్ కోసం రైతులు తమ పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ కార్డ్, రేషన్ కార్డ్, బ్యాంక్ అకౌంట్ పాస్‌బుక్, ఆధార్ కార్డుకు లింక్ అయిన ఫోన్ నెంబర్ వెంట తీసుకుని రావాలన్నారు.

గృహప్రవేశంలో పాల్గొన్న మాజీ ఎంఎల్ఎ

ప్రజాశక్తి–బిక్కవోలు

బలబద్రపురం గ్రామానికి చెందిన వైసిపి నాయకుడు ఎలా బుచ్చిలింగం గృహప్రవేశ కార్యక్రమంలో అనపర్తి మాజీ ఎంఎల్ఎ డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు పాల్గొన్నారు. వీరి వెంట పోతుల ప్రసాద్ రెడ్డి, కొవ్వూరి వెంకటరామారెడ్డి, నల్లమిల్లి వెంకటరెడ్డి (వడ్డీలు), సబ్బెళ్ళ వీరాఘవరెడ్డి, తదితరులు వైఎస్ఆర్సిపి నాయకులు పాల్గొన్నారు.

నర్సరీ అసోసియేషన్ అధ్యక్షునిగా అయ్యప్ప

ప్రజాశక్తి–కడియం

అత్యంత ప్రతిష్టాత్మకమైన కడియం నర్సరీ అసోసియేషన్ అధ్యక్షునిగా రత్నం అయ్యప్ప శనివారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఈ పదవికి మల్లు పోలరాజు, రత్నం అయ్యప్ప ప్యానల్ పోటీ పడ్డాయి. మొదటి ఏడాదిన్నర పాటు పోలరాజు, రెండో ఏడాదిన్నర రత్నం అయ్యప్ప అధ్యక్ష పదవి చేపట్టేందుకు పెద్ద మనుషుల మధ్య జరిగిన ఒప్పందం మేరకు శనివారం అయ్యప్ప బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ నర్సరీ రైతులు, నాయకులు మార్గాని సత్యనారాయణ, గట్టి సుబ్బారావు, పుల్లా వీర వెంకట్రావు, గట్టి నర్సయ్య, పుల్లా ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

రంపయర్రంపాలెంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ట

ప్రజాశక్తి–గోకవరం

మండలంలోని రంపయర్రంపాలెంలో నూతనంగా నిర్మించిన దేవి అమ్మవారి ఆలయంలో విగ్రహ ప్రతిష్టాపనలో శనివారం జనసేన పార్టీ ఇన్‌ఛార్జి తుమ్మలపల్లి రమేష్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గంటా తేజ, మాదారాపు వీరబాబు, అరిణే రాజేష్, రాజనాల శ్రీను, అడబాల వీరబాబు. పాల్గొన్నారు.

పిఎం కిసాన్ పథకం కోసం భూ ఆధార్

ప్రజాశక్తి–గోకవరం


కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ పథకాల్లో సరైన లబ్ధిదారులను గుర్తించి పథకాలు వర్తింపజేసేందుకు కొత్తగా భూ ఆధార్ లేదా ఫార్మర్ రిజిస్ట్రీ తీసుకు వచ్చినట్టు మండల వ్యవసాయశాఖ అధికారి రాజరాజేశ్వరి తెలిపారు. భూ ఆధార్ ఉన్నవారికి మాత్రమే పిఎం కిసాన్ వంటి పథకాలు వర్తిస్తాయని, భూమి ఉన్న రైతులు కింది సూచించిన పత్రాలతో సమీప రైతు సేవా కేంద్రంలోను ఫిబ్రవరి 25 తేదీలోగా నమోదు చేసుకోవాలన్నారు. రైతులు సూచించిన పత్రాలు ఈ విధంగా రైతు సేవ కేంద్రంలో చూపించాలని తెలిపారు. రైతు పట్టాదారు పాస్ పుస్తకం, 1బి, ఆధార్ కార్డు సమర్పించి భూ ఆధార్ పొందాల్సిందిగా రాజరాజేశ్వరి కోరారు.

సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

ప్రజాశక్తి – రాజమహేంద్రవరం

ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా బాధిత కుటుంబానికి రూ.3.25 లక్షల చెక్కును ఎంఎల్ఎ ఆదిరెడ్డి శ్రీనివాస్ శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక 3వ డివిజన్ రాజేంద్రనగర్‌కు చెందిన షేక్ కాశిమ్‌కు వైసిపి పాలనలో కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ జరిగిందన్నారు. అయితే అప్పటి నుంచి అతడు మంచంపైనే ఉండటంతో కుటుంబం ఆర్థికంగా చాలా ఇబ్బందులు పడుతోందన్నారు. రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ ఛైర్మన్ కుడుపూడి సత్తిబాబు దృష్టికి ఈ విషయాన్ని తీసుకురావడంతో బాధిత కుటుంబానికి న్యాయం చేసేందుకు సిఎం చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. దీంతో సిఎం సహాయ నిధి నుంచి రూ.3.25 లక్షలు మంజూరు చేశారని అన్నారు. కాశిమ్ మాట్లాడుతూ సిఎం చంద్రబాబు, ఎంఎల్ఎ ఆదిరెడ్డి శ్రీనివాస్, కుడుపూడి సత్తిబాబులకు కృతజ్ఞతలు తెలిపారు.

కార్టూ'నిజం'



వేడెక్కిన రాజకీయం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల నేపథ్యంలో ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో ఒక్కసారిగా రాజకీయం వేడెక్కింది. గత వారంలో ఉభయ ఉమ్మడి గోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ నోటిఫికేషన్ విడుదలైన విషయం విధితమే. ఈ నేపథ్యంలో ఎలక్షన్ కోడ్ అమల్లోకి వచ్చింది. దీంతో టిడిపి అధినేత, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు రాక వాయిదా పడిన విషయం విధితమే. మరో వైపు పట్టభద్రుల ఎంఎల్‌సి అభ్యర్థుల నామినేషన్ ప్రక్రియ జోరుగా సాగింది. ఇంకో వైపు పిడిఎఫ్ అభ్యర్థి డిఘ్న వీర రాఘవులు, కూటమి అభ్యర్థిగా బరిలో నిలిచిన పేరాబత్తుల రాజశేఖరం ప్రచార కార్యక్రమాలు ప్రారంభించారు. ఉపాధ్యాయులు, ఉద్యోగస్తులతో పాటు రాజకీయ ప్రముఖులు సైతం తమ అభ్యర్థులను గెలిపించాలని జోరుగా ప్రచారం చేపడుతున్నారు. ప్రజా సమస్యలపై సమరశీల పోరాటాలు చేసిన ఘన చరిత్ర పిడిఎఫ్ సొంతం. ఇటీవల జరిగిన ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఉప ఎన్నికలల్లోనూ పిడిఎఫ్ అభ్యర్థి గురుమూర్తి విజయఢంకా మోగించారు. అదే ఒరవడి ఈ ఎన్నికలలోనూ పునరావృతం అవుతుందని ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పట్టభద్రులు అభిప్రాయపడుతున్నారు. ఆదేవిధంగా అధికార పార్టీ సైతం ఓటర్లను ప్రభావితం చేసేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేసింది. ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రులు ఎవరిని గెలిపిస్తారో తెలుసుకోవాలంటే మరి కొంత కాలం వేచిచూడాల్సిందే.

రబీ సాగుకు నీటి గండం

రబీ సాగుకు నీటిగండం మొదలైంది. గోదావరి నదీ పరివాహక ప్రాంతం కావడంతో జిల్లాలో అత్యధిక ప్రాంతాల్లో నీటి వనరులు పుష్కలంగా ఉన్న విషయం విధితమే. బహుళార్థక సాధక ప్రాజెక్టు పోలవరం పూర్తి చేస్తామంటూ ప్రభుత్వాలు చేసిన ప్రకటనలు ఆచరణకు నోచుకోవడం లేదు. జాతీయ ప్రాజెక్టు నిర్మాణానికి పూర్తి స్థాయి నిధులు కేటాయించాలని కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపిని ప్రశ్నించలేని అసమర్థతను కూటమి ప్రభుత్వం ఆత్మవిమర్శ చేసుకోవాలనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. ప్రతి ఏటా వేసవి పనులు నిర్వహించి కాలువల ఆధునీకరణ, తూటు కాట తొలగింపు, గోదావరి డ్రెడ్జింగ్ నిర్వహించటం దశాబ్ధాల కాలంగా ఆనవయాయితీగా వస్తోంది. డ్రెడ్జింగ్ పనులు, పంట కాల్వల పూడిక తీత పనులు గత రాష్ట్ర ప్రభుత్వం అటకెక్కించింది. వ్యవసాయ రంగంలో కీలకమైన నీటి వనరులు నిర్వహణ చేసుకోవాలనే ముందుచూపు లేకపోవటం విమర్శలకు దారితీస్తోంది. తాజాగా రబీ సాగు ప్రారంభమవుతున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి కాలువల ఆధునీకరణ పనులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

కేంద్ర ప్రభుత్వ విధానాలపై కార్మిక సంఘాల కన్నెర్ర

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై కేంద్ర కార్మిక సంఘాలు కన్నెర్ర చేశాయి. కార్మిక సంఘాలు పోరాడి సాధించుకున్న చట్టాలను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం 4 లేబర్ కోడ్‌లుగా మార్చి కార్మికుల హక్కులను కాలరాస్తున్న నేపథ్యంలో ఆందోళనలు మిన్నంటాయి. కార్మిక సంఘాలు ఈ వారంలో ఉమ్మడి వ్యాప్తంగా చేపట్టిన ఆందోళనల్లో కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని తమ ఆందోళనను వ్యక్తం చేశారు. అదేవిధంగా ఉపాధి హామీ పథకానికి తాజా బడ్జెట్‌లో నిధుల కోత తప్పదేమో. గ్రామీణ ప్రాంతాల్లో ఈ పథకం పేదల జీవన స్థితిగతుల్లో కీలక పాత్ర పోషిస్తున్న విషయం విధితమే. అటువంటి పథకంలో నూతన విధానాల ఫలితంగా కార్మికులు పని ప్రదేశాల్లో

గోదారి గలగలలు

కనీస సౌకర్యాలను కల్పోయారు. తాజాగా ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో ఉపాధి కార్మికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించే దిశగా ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాలని వ్యవసాయ కార్మిక సంఘాలు కోరుతున్నాయి.

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పెరుగుతున్న ఎండలు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉష్ణోగ్రతలు క్రమక్రమంగా వేడెక్కుతున్నాయి. ప్రతి ఏటా మార్చి, ఏప్రిల్ భానుని ప్రతాపం అధికంగా ఉంటుంది. అయితే ప్రస్తుతం ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఉక్కపోత వెంటాడుతోంది. ఫిబ్రవరి ప్రారంభంలోనే ఇలా ఉంటే రాబోయే రోజుల్లో తాపాన్ని తట్టుకోవడం ఎలాగని ప్రజలు ఆందోళన వ్యక్తమవుతోంది. పగలు ఎండ వేడిమి, రాత్రి పూట పొగమంచు, చలి తీవ్రత కొనసాగుతోంది. ప్రస్తుత వాతావరణంలో ప్రజలు పలు రోగాల బారిన పడుతున్నారు. దీనికి తోడు అనధికార విద్యుత్ కోతలు గోరుచుట్టుపై రోకలి పోటులా మారాయి. మరమ్మతుల పేరుతో నిరంతరం విద్యుత్ కోతలు పరిపాటిగామారాయి. పాలనా యంత్రాంగం ఇప్పటికైనా దృష్టి చూపి అంతరాయాలు లేని విద్యుత్ సరఫరా అందించాలని ప్రజలు కోరుతున్నారు.

నేరాలు ఘోరాలు

మెట్ల పైనుంచి జారి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - గొల్లప్రోలు, యు.కొత్తపల్లి

విద్యుత్ మీటర్ రీడింగ్ తీయడానికి వెళ్లిన వ్యక్తి ప్రమాదవశాత్తు మెట్లపై జారి పడిన ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన చేబ్రోలులో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..ఉప్పాడ కొత్తపల్లి చెందిన మిరియాల శ్రీనివాస్(45) శనివారం ఉదయం 10 గంటలకు చేబ్రోలులోని రథం బాట పెద్ద చెరువు దగ్గర ఏరియాలో చల్ల ధర్మరాజుకు చెందిన ఇంటి వద్ద విద్యుత్ మీటర్ బిల్లు తీయడానికి మేడ పైకి వెళ్లగా ప్రమాదవశాత్తు పై నుంచి జారి పడిపోయాడు. వెంటనే చేబ్రోలు విద్యుత్ శాఖ సిబ్బంది కాకినాడ మెడికవర్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో మధ్యాహ్నం 3 గంటల సమయంలో అతను మృతి చెందాడు. తమ్ముడు మిరియాల పార్వతీ రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ ఎన్.రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

భూ వివాదంతో వ్యక్తిపై దాడి

ప్రజాశక్తి - ముమ్మిడివరం

భూ వివాదంలో ఒక వ్యక్తిపై ఇద్దరు వ్యక్తులు దాడి చేసి గాయపరిచిన సంఘటనలో ఒక వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. శనివారం దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని అనాతవరం గ్రామానికి చెందిన కోటిపల్లి నవీన్, బొర్రా సత్య సోమేశ్వరరావు, బొర్రా కృష్ణారావు మధ్య భూ వివాదం కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో కోటిపల్లి నవీన్‌పై బొర్రా సత్య సోమేశ్వరరావు, కృష్ణారావులు శుక్రవారం సాయంత్రం దాడి చేశారు. ఈ దాడిలో గాయపడిన నవీన్ ముమ్మిడివరం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ దాడికి ఒక న్యాయవాది ప్రోత్సహించడంతో దాడి చేసిన ఇద్దరు వ్యక్తులు, న్యాయవాది పైనా బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడున. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ డి.జ్వాలాసాగర్ తెలిపారు.



పరామర్శిస్తున్న వైసిపి శ్రేణులు

వెంకటరమణకు వైసిపి శ్రేణుల పరామర్శ

ప్రజాశక్తి - అంబాజీపేట

పుల్లేటికుర్రులో మాతృ వియోగంలో ఉన్న గ్రామశాఖ కార్యదర్శి గుత్తుల వెంకటరమణ ను వైసిపి శ్రేణులు శనివారం పరామర్శించారు. మండల శాఖ అధ్యక్షులు విత్తనాల ఇంద్రశేఖర్, జడ్‌పిటిసి సభ్యురాలు బూడిద వరలక్ష్మి, గ్రామ శాఖ అధ్యక్షులు దంగేటి సూర్యనారాయణ, ఎంపిటిసి వడలి కృష్ణ, అందె మూర్తి, ఉందుర్తి నాగబాబు, తదితరులు వెంకటరమణ కుటుంబాన్ని పరామర్శించి ఆయన మాతృమూర్తి మృతికి సంతాపం వ్యక్తం తెలిపారు.



బి.దొడ్డవరం-పాశర్లపూడి బాడవ లింక్ రోడ్డు దుస్థితి

మట్టి రోడ్డుతో తప్పని ఇబ్బందులు


ప్రజాశక్తి - మామిడికుదురు

పాలకులు మారుతూనే ఉన్నారు దశాబ్దాల తరబడి దీర్ఘకాల సమస్య పరిష్కారం కోరుతూ పంపిన ప్రతిపాదనలు కార్యాచరణకు నోచుకోవటం లేదు వ్యవసాయ మార్కెట్ కమిటీ రైతుల నుంచి పన్నుల రూపంలో దండుకుంటున్న వ్యవసాయ ఉత్పత్తులు తరలించేందుకు లింకు రోడ్లు ఏర్పాటు పై దృష్టి సారించకపోవడంతో మట్టి రహదారి పైనే వ్యవసాయ ఉత్పత్తులు తరలించేందుకు అవస్థలు పడుతున్నామని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు వరదల సమయంలో ఆ నాలుగు మాసాలు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని రైతుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు

లింకు రోడ్ల ప్రతిపాదనల కార్యాచరణ ఎప్పటికో

పెదపట్నంలంక, కొమ్మల వారి పాలెం, అప్పనపల్లి, బి.దొడ్డవరం గ్రామాల ప్రజలు జిల్లా కేంద్రమైన అమలాపురం రాకపోకలు సాగించేందుకు బి.దొడ్డవరం-పాశర్లపూడి బాడవ లింక్ రోడ్డు ఎంతో ప్రయోజనం ఉంటుంది. బి దొడ్డవరం ఆర్అండ్‌బి రోడ్డు నుంచి కిలోమీటర్ మేర సిసి రోడ్డు ఉంది. మరో కిలోమీటర్ మేర గ్రావెల్ రోడ్డు ఉంది అచ్చట నుంచి ఏటుగట్టుమీదుగా వైనతేయ వారధి వరకు సుమారు కిలోమీటరన్నర మేర సిసి రోడ్డు నిర్మించాలని ప్రతిపాదనలు పంపించారు. గత ప్రభుత్వంలో ఈ రహదారి ఆధునికీకరణకు దృష్టి సారించలేదు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వము దృష్టి సారించి సిసి రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేసి తమ అవస్థలు తొలగించాలని లంక గ్రామాల ప్రజలు పి. గన్నవరం ఎంఎల్ఎ గిడ్డి సత్యనారాయణ, అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాదుర్ దృష్టి సారించాలని లంక గ్రామాల ప్రజలు విన్నవిస్తున్నారు. రహదారిలో పాటు రేవుపై వంతెన శిథిలావస్థకు చేరుకుంది ఈ వంతెన కూడా ఆధునికీకరించాలని కోరుతున్నారు. ఈ రహదారికి నిర్మిస్తే నాలుగు లంక గ్రామాల ప్రజలు జిల్లా కేంద్రానికి రాకపోకలు సాగించేందుకు ఎంతో ప్రయోజనం చేకూరుతుంది ఈ రహదారితో సుమారు 10కిలోమీటర్లు చుట్టూ తిరిగి రావలసిన అవస్థ తప్పుతుంది.

సిసి రోడ్డు ఏర్పాటుకు ప్రతిపాదనలు



ఈ రహదారి విషయమై బి.దొడ్డవరం - పాశర్లపూడి బాడవ సరిహద్దు నుంచి కరకట్ట మీదుగా వైనతేయ వారధి వరకు సిసి రోడ్డు ఏర్పాటుపై పంచాయతీరాజ్ డిఇచే ప్రతిపాదన రూపొందించి నిధులు మంజూరుకు పంపించాం. బి.దొడ్డవరం, పెదపట్నంలంక అప్పనపల్లి గ్రామాల ప్రజల జిల్లా కేంద్రమైన అమలా పురం చేరుకు నేందుకు పది కి.మీ మేర దూరాభారం తగ్గి ప్రయోజనకరంగా ఉంటుంది.

-చెల్లుబోయినశివరామ సుబ్రహ్మణ్యం, సర్పంచ్, బి.దొడ్డవరం

రాజ్యాంగ పరిరక్షణకు కృషి చేయాలి

ప్రజాశక్తి - కాకినాడ

భారత రాజ్యాంగాన్ని పరిరక్షించుకునేందుకు న్యాయవాదులు కృషి చేయాలని సుప్రీంకోర్టు న్యాయవాది, ఐఎల్ఎ జాతీయ అధ్యక్షులు చింతల శ్రీకాంత్ పిలుపునిచ్చారు. శనివారం ఇండియన్ లాయర్స్ అసోసియేషన్ జిల్లా సమావేశం స్థానిక కోర్టుల ప్రాంగణంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగ స్ఫూర్తిని సమాజానికి అందించడంలో పాలకులు విఫలమయ్యారన్నారు. ఐఎల్ఎ రాష్ట్ర అధ్యక్షులు జి.శాంతకుమార్ మాట్లాడుతూ న్యాయవాదులు ఎదుర్కొంటున్న సమస్యలు, సామాజిక సమస్యల పరిష్కారం దిశగా ఐఎల్ఎ కృషి చేస్తుందన్నారు. ఎన్‌టిఆర్ హెల్త్ యూనివర్సిటీ మాజీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ బాబ్జి మాట్లాడుతూ సామాన్యులకు మెరుగైన న్యాయం అందించేందుకు న్యాయవాదులు కృషి చేయాలన్నారు. సభకు



ఐఎల్ఎ మహాసభలో మాట్లాడుతున్న శ్రీకాంత్

అధ్యక్షత వహించిన న్యాయవాది టి.పృథ్వీరాజ్ మాట్లాడుతూ న్యాయవాదులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ఐఎల్ఎ కృషి చేస్తుందన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు ముత్తింటి విశ్వేశ్వరరావు మాట్లాడుతూ ప్రజలలో చట్టాల పట్ల అవగాహన కల్పించాలన్నారు ఈ కార్యక్రమంలో న్యాయవాదులు జవహర్ అలీ, పిల్లి శ్రీనివాస్, జయలక్ష్మి, పితాని శ్రీనివాస్, సయ్యద్ సాలార్, ప్రసన్నకుమార్, జెవి.రమణ, సునీత, తదితరులు పాల్గొన్నారు.

ఐఎల్ఎఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా పృథ్వీరాజ్



ఇండియన్ లాయర్స్ అసోసియేషన్(ఐఎల్ఎ) జిల్లా నూతన కమిటీని రాష్ట్ర అధ్యక్షులు జి.శాంత కుమార్ నియమించారు. ఐఎల్ఎ ఉమ్మడి జిల్లా అధ్యక్షునిగా టి.పృథ్వీరాజ్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా పితాని వెంకటేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షులుగా కోలా శ్రీహరిరావు, కార్యదర్శిగా వందే విజయ రాజ్ కుమార్, కోశాధికారిగా జెవి.రమణలతో కార్యవర్గాన్ని నియమించారు.

యానాం వార్తలు



ర్యాలీని ప్రారంభిస్తున్న డిఐజి సత్యసుందరం

డ్రగ్స్ అనర్థాలపై అవగాహనా ర్యాలీ

ప్రజాశక్తి - యానాం

స్థానిక ఎస్ఆర్‌కె ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల విద్యార్థులు మాదకద్రవ్యాలు రవాణా, వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రత్యేక శిబిరంలో భాగంగా ఈ ర్యాలీని యానాం పరిపాలనాధికారి కార్యాలయం వద్ద పుదుచ్చేరి డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీసు(డిఐజి) ఆర్.సత్య సుందరం శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రాంతీయ పరిపాలనాధికారి మునుస్వామి, ఎస్‌పి రాజశేఖరన్, ప్రిన్సిపల్ డాక్టర్ వరుగు భాస్కరరెడ్డి పాల్గొన్నారు. అనంతరం విద్యార్థుల ర్యాలీ విష్ణాలయంవీధి, పిల్లారాయవీధి, తదితర వీధుల మీదుగా బాలయోగి స్టేడియం వరకు సాగింది. డ్రగ్స్ వాడకం, అక్రమ రవాణా వంటి కార్యకలాపాలకు దూరంగా ఉండాలని, డ్రగ్స్‌కు బానిస కాకూడదని విద్యార్థులు నినాదాలు చేశారు. మధ్యాహ్నం కళాశాలలో ట్రాఫిక్ నిబంధనలపై సదస్సు నిర్వహించారు. సదస్సులో రీసోర్సు పర్సన్‌లు రహదారి భద్రత, ప్రమాదాల నివారణ, నిబంధనలు పాటించడం వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సిఐ షన్ముగం, ట్రాఫిక్ ఎస్ఐ నూకరాజు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు చెల్లి నరేష్, ఎస్.శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌బిఐలో మెగా హోమ్ లోన్ మేళా

ప్రజాశక్తి - యానాం

యానాం స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) యానాం బ్రాంచిలో మెగా హోం లోన్ మేళా నిర్వహిస్తున్నట్టు బ్రాంచి మేనేజర్ కళ్యాణ్ తేజస్వి తెలిపారు. ఈ మేళా అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అతితక్కువ సమయంలో లోను మంజూరు చేయడం జరుగుతుందని వివరించారు. ప్రోసెసింగ్ ఛార్జీలు, వడ్డీ రేట్లు తక్కువగా ఉంటాయని తెలిపారు. నెలవారీ ఇఎంఐ కూడా తక్కువ పడుతుందన్నారు.

ఉత్సాహంగా బాస్కెట్ బాల్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి - పిఠాపురం

స్థానిక రాజీవ్ గాంధీ మున్సిపల్ హైస్కూల్ ఆవరణలో రాష్ట్ర స్థాయి యూత్ బాల, బాలికల బాస్కెట్ బాల్ పోటీలు ఆదివారం ఉత్సాహపూరిత వాతావరణంలో ప్రారంభం అయ్యాయి. వివిధ జిల్లాల నుంచి 20 జట్లు ఈ పోటీలో తలపడనున్నాయి. ఈ పోటీలను మాజీ ఎంపి వంగా గీత, అసోషియేషన్ గౌరవ అధ్యక్షులు బివి.కృష్ణంరాజు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం కోప్పన మోహనరావు, రామ దేవి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాజమహేంద్రవరంకు చెందిన జాతీయ బాస్కెట్ బాల్ క్రీడాకారుడు బి.పవన్ మృతికి సంతాపంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. పిఠాపురం బాస్కెట్ బాల్ ప్లేయర్స్ అసోసియేషన్ అధ్యక్షులు మొగలి కాశీ విశ్వనాథం అధ్యక్షతన జరిగిన సభలో పలువురు మాట్లాడారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోని రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో కోచ్ రుద్ర, రాష్ట్ర బాస్కెట్ బాల్ అసోషియేషన్ కార్యదర్శి చక్రవర్తి, భూషణం, మున్సిపల్ వైస్ ఛైర్‌పర్సన్ జ్యోతి, గండేపల్లి బాబి, పలువురు కౌన్సిలర్లు వర్ధినీడి సుజాత, వివిఎస్.రెడ్డి, అసోషియేషన్ ప్రధాన కార్యదర్శి బొజ్జ మాణిక్యాలరావు, ఏలీషా, సతీష్, తదితరులు పాల్గొన్నారు.



బాలికల జట్ల మధ్య హోరాహోరీగా సాగుతున్న బాస్కెట్ బాల్ పోటీలు



జ్యోతిప్రజ్వలన చేస్తున్న మాజీ ఎంపి వంగా గీత

ఆదిత్యలో ముగిసిన అతిథి ఉపన్యాసాలు

ప్రజాశక్తి - గండేపల్లి

సూరంపాలెంలోని ఆదిత్య యూనివర్సిటీ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగంలో ఎఐ, డేటా సైన్స్‌లో 'గణిత ఆప్టిమైజషన్'పై రెండు రోజుల ఉపన్యాస కార్యక్రమం శనివారంతో ముగిసింది. న్యూఢిల్లీకి చెందిన ఇంద్రప్రస్థ విశ్వవిద్యాలయం ఆచార్యులు రష్మీ భరద్వాజ్ ముగింపు సభలో పాల్గొని మాట్లాడారు. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. ఈ ఉపన్యాసాల కార్యక్రమం విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడిందని యూనివర్సిటీ డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ ప్రో వైస్ ఛాన్సలర్ అకడమిక్స్ డాక్టర్ ఎస్.రమాశ్రీ, రిజిస్ట్రార్ డాక్టర్ జి.సురేష్, డీన్ స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ డాక్టర్ డోలా సంజయ్ ఎస్, అసోసియేట్ డీన్ స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ డాక్టర్ ఎంవి.రాజేష్, విభాగాధిపతి డాక్టర్ కె.స్వరూప, కోఆర్డినేటర్ డాక్టర్ హరి జ్యోతుల, విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.



కోలసంబరం చేస్తున్న కళాకారులు

ఘనంగా కాలభైరవ స్వామి తీర్థం

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలంలోని కోరంగి పంచాయతీ సుబ్బారాయుడు దిమ్మ ప్రాంతంలో కాలభైరవ స్వామి తీర్థం శనివారం కన్నుల పండుగగా జరిగింది. ఈ సందర్భంగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా వేలాదిమంది ప్రజలు భైరవ స్వామి ఆలయానికి పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆలయ ప్రధానార్చకులు చెక్కా విష్ణు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గణేష్ మహాలక్ష్మి చేపల వర్తక సంఘం ఆధ్వర్యంలో వేలాదిమంది ప్రజలకు అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా కోలాటం, అప్పన్న ఎద్దుల ఊరేగింపు, ప్రదర్శన ఆకట్టుకున్నాయి. ఆలయ ప్రాంగణం వద్ద నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

మాస్టర్ అథ్లెటిక్స్‌లో నాగబాబుకు పతకాలు

ప్రజాశక్తి - సామర్లకోట

ఈనెల 6వ తేదీ నుంచి 8వ తేదీ వరకూ రాజస్థాన్‌లో జరిగిన 44వ నేషనల్ మాస్టర్స్ అథ్లెటిక్స్ ఓపెన్ ఛాంపియన్ షిప్ మీట్‌లో సామర్లకోటకు చెందిన యాతం నాగబాబు ఆరు పతకాలను సాధించాడు. 100, 200, 400, 800 మీటర్స్ రన్నింగ్ పోటీల్లో కాంస్యం పతకాలు సాధించాడు. ఇంకా 4 x 400 మీటర్లు రిలే పందెంలో బంగారు పతకం, 4 x 100 మీటర్లు రిలే పరుగు పందెంలో వెండి పతకం మొత్తం 6 విభాగాల్లో మొత్తం 4 కాంస్య పతకాలు, ఒక బంగారు, వెండి పతకాలను సాధించాడు. జిల్లా మలేరియా విభాగంలో సబ్ యూనిట్ అధికారిగా పని చేస్తున్న నాగబాబు అథ్లెటిక్స్‌లో రాణించడం పట్ల పట్టణానికి చెందిన పలువురు నాయకులు, ప్రముఖులు అభినందనలు తెలిపారు.



క్రీడాకారుడు నాగబాబు

వల్లభ స్వామికి రూ.5.45 లక్షల ఆదాయం

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని తిరుపతి గ్రామంలోని శృంగార వల్లభ స్వామి ఆలయానికి శనివారం ఒకరోజు రూ.5.45 లక్షల ఆదాయం సమకూరిందని ఆలయ కార్యనిర్వాహణాధికారి వడ్డి శ్రీనివాసరావు తెలిపారు. వివిధ దర్శనం టికెట్లు ద్వారా రూ.3,69,710, అన్నదాన విరాళాల ద్వారా రూ.1,27,613, కేశఖండన ద్వారా రూ.8,800, తులాభారం ద్వారా రూ.1,200, లడ్డూ ప్రసాదం ద్వారా రూ.38,370 వెరసి రూ 5,45,693 ఆదాయం సమకూరిందని తెలిపారు. యాత్రికులకు ఉదయం పులిహోర, మధ్యాహ్నం అన్నదానం నిర్వహించామన్నారు. యాత్రికులకు ఆలయ అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, పెద్దింటి నారాయణచార్యులు, సిబ్బంది, స్వచ్ఛంద సేవకులు, గ్రామస్తులు సేవలందించారన్నారు.




అన్నదానంలో పాల్గొన్న యాత్రికులు

రైల్వే గేట్‌లో ఇరుక్కుపోయిన కంటైనర్

ప్రజాశక్తి - తుని

తుని జగన్నాథగిరి గేటు వద్ద శనివారం కంటైనర్ లారీ రైల్వే గేటు దాటుతుండగా గేటు మధ్యలో లారీ ఇరుక్కిపోయింది. భారీ వాహనాలు వెళ్లకుండా రైల్వే సిబ్బంది ఏర్పాటు చేసిన గేటులో నుంచి నిబంధనలకు విరుద్ధంగా కంటైనర్ లారీ అటుగా వెళ్లడంతో ఈ సంఘటన చోటుచేసుకుంది. దీంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. పోలీసులు సంఘటనా ప్రాంతానికి చేరుకుని యంత్రాల సాయంత్రో కంటైనర్‌ను బయటకు తీయించారు.



గేట్‌లో ఇరుక్కుపోయిన కంటైనర్

కుంభమేళా ప్రత్యేక రైలును ప్రారంభించిన ఎంపి

ప్రజాశక్తి - కాకినాడ

కాకినాడ - ప్రయాగ్ రాజ్(కుంభమేళా) ప్రత్యేక రైలును శనివారం కాకినాడ టౌన్ రైల్వే స్టేషన్లో ఎంపి ఉదయ్ శ్రీనివాస్ జెండా ఊపి ప్రారంభించారు. కాకినాడ జిల్లా ప్రజల సౌకర్యార్థం మహా కుంభమేళాకు అదనపు ప్రత్యేక రైలు ఏర్పాటు చేయాలని ఎంపి ఉదయ్ శ్రీనివాస్ విజ్ఞప్తి మేరకు కేంద్ర రైల్వేశాఖ ప్రత్యేక రైలు ఏర్పాటు చేసింది. ఈ రైలును రైల్వే అధికారులు, ప్రయాణికుల సమక్షంలో ఆయన జెండా ఊపి ప్రారంభిం చారు, అనంతరం కాకినాడ నుంచి సామర్లకోట వరకు స్లీపర్ బోగిలో ప్రయా ణించి ప్రయాణికులతో మాట్లాడి కుంభ మేళాలో పుణ్య స్థానాలు ఆచరించి క్షేమంగా తిరిగి రావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కుడా ఛైర్మన్ తుమ్మల బాబు, ఎస్‌సి కార్పొరేషన్ డైరెక్టర్ లాజర్‌బాబు, నాయకులు నున్న దొరబాబు, మాదేపల్లి శ్రీనివాస్, రావు అక్షయ్, నాగేశ్వరావు, ధనబాబు, మనోజ్, వరప్రసాద్ పాల్గొన్నారు.



ట్రైన్‌కు జెండా ఊపుతున్న ఎంపి ఉదయ్‌శ్రీనివాస్

ఘనంగా సిల్వర్ జూబ్లీ వేడుకలు

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక శ్రీనివాస విద్యాసంస్థల ఆధ్వర్యంలో ఎస్‌కెకెఎం జూనియర్ కళాశాల సిల్వర్ జూబ్లీ వేడుకలు శనివారం కళాశాల ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. కళాశాల ఛైర్మన్ చినబాబు అధ్యక్షతన జరిగిన ఈ వేడుకల్లో ప్రిన్సిపల్ చక్రవర్తి మాట్లాడుతూ కళాశాలలో మొదటి బ్యాచ్ 15 మందిలో 9 మంది ప్రభుత్వ ఉద్యోగాలలో స్థిరపడ్డారన్నారు. వీరిలో న్యాయమూర్తులు, పోలీసు అధికారులు, బ్యాంకు, రైల్వే ఉద్యోగులు, ఉపాధ్యాయులు, ఆడిటర్లు ఉన్నారన్నారు. ప్రముఖ కవి, మహారాణి కళాశాల విశ్రాంత అధ్యాపకులు డాక్టర్ జోష్యుల కృష్ణబాబును పూలమాలలు, సాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లు ఏసుబాబు, చక్రం, బాబురావు, మధుసూదనరావు పాల్గొన్నారు



కృష్ణబాబును సత్కరిస్తున్న నిర్వాహకులు

బాల బాలాజీ స్వామి ఆదాయం రూ.5.75లక్షలు

ప్రజాశక్తి - మామిడికుదురు

అప్పనపల్లి బాల బాలాజీ దేవస్థానానికి శనివారం వివిధ విభాగాల ద్వారా రూ.5,75,559 ఆదాయం సమకూరిందని సహాయ కమిషనర్ ఎం.సత్యనారాయణ రాజు తెలిపారు శాశ్వత నిత్యాన్నదాన ట్రస్ట్‌కు రూ.73,348, నిత్యాన్నదాన ట్రస్ట్‌కు రూ.1,09,590 ఆదాయం సమకూరిందన్నారు. 15వేల మంది భక్తులు స్వామి వారిని దర్శనం చేసుకోగా 7,800 మంది భక్తులు అన్న ప్రసాదం స్వీకరించారన్నారు.

పలుచోట్ల అన్నదానం

ప్రజాశక్తి - రౌతులపూడి, గొల్లప్రోలు

రౌతులపూడిలోని శివాలయం వద్ద ఆలయ కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో శనివారం అన్నదానం నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి భారీ సంఖ్యలో యాత్రికులు పాల్గొన్నారని కమిటీ సభ్యులు అడిగర్ల రామకృష్ణ తెలిపారు. అలాగే గొల్లప్రోలు టోల్ ప్లాజా వద్ద ఉన్న జమ్మి గంగాలమ్మ గుడి వద్ద అన్నదాన కార్యక్రమం జరిగింది. ఈ అన్నదాన కార్యక్రమంలో ప్రజల పెద్ద ఎత్తున పాల్గొన్నారని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

అన్నదానానికి విరాళాల అందజేత

ప్రజాశక్తి - ఆత్రేయపురం

మండలంలోని ర్యాలి గ్రామంలో స్వయంభు పుణ్యక్షేత్రం శ్రీ జగన్మోహిని కేశవ, గోపాలస్వామి వార్ల ఆలయానికి వచ్చే యాత్రికుల కోసం నిర్వహించే అన్నదానానికి పలువురు దాతలు శనివారం విరాళాలు అందజేశారు. రంగారెడ్డి జిల్లా దమ్మాయిగూడకు చెందిన చిన్నకోట్ల శ్రీరాముల నాగ వెంకట రమేష్ రామలక్ష్మి రూ.5 వేలు, గుంటూరుకు చెందిన గ్రంథి నాగార్జున్ మెహెర్, సమీర దంపతులు రూ.10,116, రాజమహేంద్రవరానికి చెందిన వెత్సా సత్య కిషోర్‌మెహెర్, లక్ష్మీదంపతులు రూ.10,116 ఆలయ ఇఒ బి.వెంకటరమణమూర్తికి అందజేశారు. వీరికి స్వామివారి దర్శనం చేయించి తీర్థ ప్రసాదాలతో పాటు స్వామివారి చరిత్ర పుస్తకాలను అందజేసి కతజ్ఞతలను తెలియజేశారు.

గుండెపోటు బాధితులకు అందుబాటులో ఇంజక్షన్

ప్రజాశక్తి - ఆలమూరు

గుండె పోటుకు సంబంధించిన ఖరీదైన ఇంజక్షన్ ఉచితం గా అందు బాటులోకి వచ్చిందని సిహెచ్‌సి వైద్యునిపుణులు డాక్టర్ ఎన్.అభిలేష్, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి.గోపిరామ్ అన్నారు. స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో శనివారం రోగులకు గుండె వ్యాధిపై అవగాహనా సదస్సు వారు నిర్వహించారు.ఈ సందర్భంగ వైద్యనిపుణులు మాట్లాడుతూ గుండె పోటుకు గురైన సమయంలో స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం నందు అత్యవసర వైద్యమునకు అన్ని ఏర్పాట్లు ఉన్నాయని వారు వివరించారు. విపత్కర పరిస్థితిలో సకాలంలో సత్వర వైద్యం పొందినప్పుడే ప్రాణహాని ఉండదని అన్నారు. గుండెపోటుకు గురైన వారికి సత్వర వైద్య నిమిత్తం హబ్ అండ్ స్పోక్ విధానంలో రూ.40 వేల విలువ గల ఇంజక్షన్ ఉచితంగా అందిస్తారన్నారు. ఎవరికైనా గుండె నొప్పి వస్తే తక్షణం ఆలమూరు ఆసుపత్రిలో ఇసిజీతీసి వారికి ఈ ఇంజక్షన్ అవసరమైతే తక్షణం అందిస్తామని వైద్యులు వివరించారు. ఇంజక్షన్ అందించడం వల్ల ప్రాణహాని ఉండదన్నారు. దీంతో మెరుగైన చికిత్స అవసరమైతే కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి పంపిస్తామని అన్నారు. ఆలమూరు సిహెచ్‌సిలో అందుబాటులో ఉన్న ఈ వైద్యవిధానాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.